సంపద సృష్టి.. మాటలకే పరిమితం



అమ్మపల్లిలో నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్డు

- ప్రత్యేక పాలనలో పట్టింపు కరువు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- పట్టించుకోని అధికారులు

మాగనూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన చెత్తతో సంపద సృష్టి లక్ష్యం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతుంది. చెత్తతో సంపద సృష్టించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే ధ్యేయంతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. ప్రత్యేక పాలనలో ఎవరూ పట్టించుకోకపోవడంతో సంపద సృష్టి మాటలకే పరిమితమైంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి పంచాయతీకి ఉపాధి నిధుల ద్వారా సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించారు. స్వచ్ఛభారత్, సర్వేక్షణ్ గ్రామీణ్ పథకాలలో భాగంగా చాలా చోట్ల వీటిని ఉపయోగించి సంపదను సృష్టించారు. కానీ ప్రత్యేక అధికారుల పాలనలో మాత్రం గాలికి వదిలేశారు.

అధికారుల నిర్లక్ష్యం..

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్మూలన కోసం ప్రతి రోజు తడి, పొడి చెత్తను సేకరించి వాటిని సెగ్రిగేషన్ షెడ్లకు తరలించి సేంద్రియ ఎరువులు తయారు చేసి పంచాయతీలు సంపద సృష్టించే విధంగా ప్రణాళికలు రూపొందించారు. కానీ సర్పంచుల కాలం పూర్తి కావడం, ప్రత్యేకాధికారుల పాలనలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ప్రస్తుతం ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులలో లేదా రోడ్ల పక్కన పడేస్తున్నారు.



చెత్తను సెగ్రిగేషన్ షెడ్డులో డంప్ చేస్తున్న ట్రాక్టర్

ఎరువుల తయారీ ఇలా..

గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేస్తారు. తడి చెత్తను డీ కంపోస్ట్ చేయడంతో రెండు రోజుల్లో పూర్తిగా కుళ్లిపోతుంది. దీనిని సెగ్రిగేషన్ షెడ్లలో ఉన్న బెడ్‌పై వేయడంతో అప్పటికే బెడ్‌లో ఉన్న వానపాములు చెత్తను సేంద్రియ ఎరువులుగా మారుస్తాయి. సేంద్రియ ఎరువుల తయారీకి ఉపయోగపడే వానపాములకు పోషకాలను కూడా అందిస్తారు. ఇలా వారంలో దాదాపుగా రెండు క్వింటాళ్ల సేంద్రియ ఎరువు తయారవుతుంది. తయారు చేసిన సేంద్రియ ఎరువును 20, 50 కిలోల బస్తాల్లో నింపి రైతులకు విక్రయిస్తారు.

వినియోగంలోకి తేవాలి..

గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన సెగ్రిగేషన్ షెడ్లు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. దీంతో గ్రామపంచాయతీలు ఆదాయం కోల్పోవడంతో పాటు రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన షెడ్లు దిష్టిబొమ్మల్లాగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలి.

–ఈశ్వర్‌యాదవ్, నేరడగం

ఆదాయం సమకూర్చాలి..

ప్రత్యేక పాలనలో గత కొన్ని రోజులుగా మండలంలో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారడంతో రోజు ఉదయం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి చెత్తను సేకరిస్తున్న ట్రాక్టర్లతో పాటు సిబ్బందికి జీతాలు చెల్లించడానికి భారీగా అవుతుంది. సంబంధిత అధికారులు స్పందించి సెగ్రిగేషన్ షెడ్లను ఉపయోగంలోకి తెచ్చి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

–కనకరాజు, ఉజ్జెల్లి గ్రామస్తుడు

చర్యలు చేపడతాం..

మండలంలో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారిన మాట వాస్తవమే. నిధుల కొరతతో షెడ్ల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించలేకపోయాం. త్వరలోనే పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకొని చెత్త నుంచి సంపద సృష్టించేలా చర్యలు చేపడతాం.

–శ్రీనివాసులు, ఎంపీడీవో మాగనూర్

క్లుప్తంగా

ఊట్కూరులో భారీ వర్షం



ఊట్కూరు: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. తిప్పరాస్‌పల్లి, ఓబులాపూర్, నిడుగుర్తి, ఊట్కూరు, బిజ్వార్, మల్లెపల్లి తదితర గ్రామాలలో భారీ వర్షం కురవడంతో పొలాల్లోకి వరదనీరు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వర్షాలతో పత్తి పంటకు చీడపీడలు వ్యాపించి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. మళ్లీ ఇప్పుడు భారీ వర్షం కురవడంతో పత్తి పంట చేతికి వచ్చే అవకాశం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోతకు గురైన బీటీ రోడ్డు



ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు కోతకు గురైంది. భారీ వర్షానికి రోడ్డు కోతకు గురి కావడంతో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళలో కోతకు గురైన రోడ్డు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

వర్షానికి నిలిచిన రాకపోకలు



కొత్తపల్లి: మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి భూనీడ్ వాగు ఉధృతంగా ప్రవహించడంతో భూనీడ్- కొత్తపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇదే వాగు భూనీడ్ శివారులో పారుతుండడంతో మద్దూరు నుంచి భూనీడ్ వరకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. వాగుకు వరద ఉధృతి పెరగడంతో భూనీడ్, కిషన్‌నగర్, దుప్పట్‌గట్, అల్లీపూర్ తదితర గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



కోస్గి రూరల్: నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ చేపట్టిందని మండల పరిధిలోని సర్జఖాన్‌పేట్ గ్రామ మాజీ సర్పంచ్ హరీష్‌గౌడ్ అన్నారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెడ్డిపల్లి శ్రీనివాస్‌కు రూ.1,14,000 చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ కుటుంబ పెద్దగా ఉండి పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు శెట్టి శివకుమార్, మాజీ ఎంపీటీసీ లక్ష్మి నారాయణగౌడ్ తదితరులు ఉన్నారు.

పోలీసుల తనిఖీలు



కోస్గి రూరల్: కోస్గి బస్టాండ్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో ఎస్‌ఐ బాల్‌రాజ్ అనుమానితుల వేలిముద్రలు తీసుకున్నారు. ప్రయాణికుల మాటునా కొంమంది వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారని, బస్సు ఎక్కే, దిగే సమయంలో ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే 100కు ఫోన్ చేయాలన్నారు.

గురజాడ అప్పారావుకు ఘన నివాళి

నారాయణపేట రూరల్: తేనెలొలుకు తెలుగు భాషను నలుదిశలో చాటిన కవి సార్వభౌముడు గురజాడ అప్పారావు అని, నేటి కవులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ బాలు అభిమానసంఘం రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డి అన్నారు. తెలుగు కవి గురుజాడ అప్పారావు జయంతి సందర్భంగా బసదేశ్వర స్వామి దేవాలయం లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని చాటి చెపపిన మహోన్నత కవి గురుజాడ అని ఆయన కవితా సంకలనాలను కొనియాడారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా జట్టుకు ఎంపిక

మరికల్: ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో నలుగురు మరికల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు జీహెచ్‌ఎం నాగరత్నమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–17 క్రికెట్ విభాగంలో ఫీస్ ఏంజిల్స్ స్కూల్‌కు చెందిన అతిథి, అండర్–14లో భారతి ఉన్నత పాఠశాలకు చెందిన హర్షతేజ్, మైత్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జగదీశ్ ఎంపికయ్యారన్నారు. అలాగే విద్యార్థి జగదీశ్ ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు కూడా ఎంపికైనట్లు పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, పలువురు క్రీడాకారులు అభినందించారు.

కిక్‌బాక్సింగ్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌లో ఆదివారం ముగిసిన రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు మహబూబ్‌నగర్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జహంగీర్‌పాషా ఖాద్రీ తెలిపారు. ఆయా విభాగాల్లో ఆరుగురు క్రీడాకారులు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. గుల్‌ఫిషా–46 కేజీల విభాగంలో, హఫ్సా బేగం–42 కేజీల విభాగంలో, అజహర్ -60కేజీల విభాగంలో బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు.

అఖిల భారతీయ విజ్ఞాన మేళాకు ఎంపిక

నారాయణపేట టౌన్/నారాయణపేట రూరల్: పట్టణంలోని సరస్వతీ శిశు మందిరంలో చదువుతున్న పవార్ నితిన్ దక్షిణ భారత విజ్ఞాన మేళాలో ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 18,19,20వ తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన మేళాలో మట్టి విగ్రహాల తయారీ అంశంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు దత్తు చౌదరి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. నితిన్ పవార్ వచ్చే నెల 4 నుంచి 7వ వరకు బీహార్‌లోని సీతామఢీలో జరిగే అఖిల భారతీయ విజ్ఞాన మేళాలో పాల్గొంటాడని తెలిపారు. అఖిల భారతీయ విజ్ఞాన మేళాకు ఎంపికైనా విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



బహుమతి అందుకుంటున్న నితిన్

'ర్యాపిడో, ఉబర్ యాప్‌లు రద్దు చేయాలి'

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఆటో వాలాల పొట్టకొడుతున్న రాపిడో, ఉబర్ యాప్‌లను రద్దు చేయాలని ఆటో జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన జేఏసీ సమావేశంలో ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి రాములు, రామ్మోహన్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాపిడో, ఉబర్, ఓలా యాప్‌లను తీసుకొచ్చి నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాట మాడుతున్నాయని ఆరోపించారు. ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న సంవత్సరానికి రూ.12 వేలు నేటికీ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాజు, నగేశ్, బాబుమీయా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాములు

రహదారులను కప్పేసిన ముళ్లపొదలు

నర్వ: మండలంలోని ప్రధాన రహదారులు ముళ్లపొదలతో మూసుకుపోయి ప్రమాదకరంగా మారాయని మండల ప్రజలు వాపోతున్నారు. యాంకి నుంచి పెద్దకడ్మూర్, నర్వ నుంచి లక్కర్‌దొడ్డి, కొత్తపల్లి, రాయికోడ్ నుంచి సీపూర్‌కు వెళ్లే బీటీ రహదారులపై ముళ్లపొదలు నిండుకున్నాయన్నారు. ప్రధాన మలుపుల వద్ద ముళ్లపొదలు రోడ్డును ఆక్రమించుకోవడంతో ఎదురు ఎదురుగా వచ్చే వాహనాలకు కనబడక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ముళ్ల పొదలను తొలగించాలని కోరుతున్నారు.



యాంకి-పెద్దకడ్మూర్ రోడ్డు దుస్థితి

వైభవంగా బతుకమ్మ వేడుకలు



మక్తల్: పట్టణంలోనిని సుగురేశ్వర కాలనీలో ఆదివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలితమ్మ పాల్గొని మహిళలతో ఆడిపాడారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవంటి పండుగలు సమాజంలో ఐక్యత ఆనందాన్ని పంచుతాయని తెలిపారు. తర్వాత ఊరేగింపులో పాల్గొని స్థానిక చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు

'చలో హైదరాబాద్' విజయవంతం చేద్దాం

నారాయణపేట రూరల్: కేజీబీవీల్లో విధులు నిర్వర్తిస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకు సోమవారం తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి నరసింహ కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కేజీబీవీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో టీయూసీఐ సిబ్బంది, కేజీబీవీ ఉద్యోగులు ఉన్నారు.

అంధ విద్యార్థులకు అన్నదానం



ఆత్మకూర్: మండలంలోని మూలమల్ల గ్రామానికి చెందిన సామాజిక వేత్త దేశాయి పద్మజారెడ్డి అంధ విద్యార్థులకు అన్నదానం చేశారు. ఆదివారం స్థానిక సమ్మిళిత ఫౌండేషన్‌లో ఉంటున్న విద్యార్థులను కలిసి వారికి కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫౌండేషన్ స్థాపించి అంధ విద్యార్థులను ఆదరిస్తున్న నిర్వాహకుడు గాండ్ల శివకుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో వాలీబాల్ కోచ్ ఖాదర్, కబడ్డీ కోచ్ శ్రీనివాసులు, వెంకటరాములు, ఎల్లన్న, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు.. స్వచ్ఛత కనుమరుగు



పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పారిశుద్ధ్య సిబ్బంది మురుగు కాల్వలు సరిగా శుభ్రం చేయకపోవడంతో హైదరాబాద్ వెళ్లే మార్గంలో భారత్ పెట్రోలియం పక్కన ఉన్న ప్రధాన మురుగు కాలువ చెత్తతో నిండిపోయి చెరువును తలపిస్తుంది. చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుండడంతో సమీప ప్రాంతాల ప్రజలు, అటుగా వెళ్లే ప్రయాణికులకు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తుంది. దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని మున్సిపల్ అధికారులు వీలైనంత త్వరగా కాల్వను శుభ్రం చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. - నారాయణపేట టౌన్

గుంత తవ్వారు.. వదిలేశారు



మండల కేంద్రంలోని ఒకటవ వార్డులో పైపులైన్ లీకేజీ అవుతుండడంతో మరమ్మతు కోసం పంచాయతీ సిబ్బంది గుంతను తవ్వి అలాగే వదిలేశారు. రోడ్డు పక్కనే గుంతను తవ్వి వదిలేయడంతో రాత్రి వేళల్లో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వారం క్రితం గుంతను తవ్వారని, కనీసం హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి స్పందించి గుంతను పూడ్చి వేయించాలని ప్రజలు కోరుతున్నారు. - మరికల్

పంచాయతీ భవనాన్ని త్వరగా నిర్మించాలి

మాగనూర్: మండలంలోని కొన్ని గ్రామాలను పంచాయతీలుగా ప్రకటించి నూతన పంచాయతీ భవనాల నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అయితే పలు గ్రామపంచాయతీల భవనాలు పూర్తి కాగా ప్రారంభించి అందులో సిబ్బంది విధులు కూడా నిర్వర్తిస్తున్నారు. అయితే నేరడగందొడ్డి గ్రామపంచాయతీ భవనం మాత్రం ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. ఏళ్లు గడిచినా పనులు మాత్రం సాగడం లేదు. అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నేరడగందొడ్డి పంచాయతీ భవనాన్ని త్వరగా నిర్మించి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



నత్తనడకన సాగుతున్న పంచాయతీ భవన నిర్మాణ పనులు

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

మక్తల్: పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. 22న ధ్వజారోహణ, సాయంత్రం శేషవాహనం, 16న సూర్యప్రభ వాహనం, 23న కృల్పవృక్షవాహనం, 24న మండపవాహనాం, 25న సింహవాహనం, 26న కలశా అభిషేకం సాయంత్రం పల్లకిసేవ , 27న గరుడ వాహనం , 28న సూర్యప్రభవాహనాం, 29న సుదర్శన హోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

22 నుంచి నవరాత్రి ఉత్సవాలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ ఆదివారం తెలిపింది. అమ్మవారికి 9రోజుల పాటు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు చేయనున్నట్లు తెలిపారు. 22న అమ్మవారికి అభిషేకం , 23న ప్రభాతబేరి భజన కార్యక్రమం 28న పశ్చిమ ముఖ అంజనేయస్వామి మహిళా భజన మండలితో భక్తి కార్యక్రమాలు, 30న దుర్గాష్టమి సందర్భంగా అభిషేకం, ప్రత్యేక అలంకరణ నిర్వహిస్తామన్నారు.

ఉత్సవాల కరపత్రాలు విడుదల

ధన్వాడ: మండల కేంద్రంలోని గంగభవని దేవలయంలో ఆదివారం దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. గంగభవాని దేవాయలంలో ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నర్సింములు నాయుడు తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్, నర్సింములు, రాంచంద్రయ్య, శ్రీనివాసులు, నర్సిములు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

నర్వ: అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్వ, పెద్దకడ్మూర్ శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే పంచామృతాభిషేకాలు, లింగాష్టక, బిల్వార్చన ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వామి చిత్రపటాలతో పల్లకి సేవ చేపట్టారు. మధ్యాహ్నం దాతలతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి ఆలయాల్లో అఖండ భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అలంకరణలో వాసవిమాత

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు

నారాయణపేట రూరల్: అమావాస్య సందర్భంగా ఆదివారం పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో అదే విధంగా కళ బెళగుందె బసదేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు.

శక్తి పీఠంలో నేటి నుంచి ఉత్సవాలు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని శక్తి పీఠంలో శ్రీ దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు పూజశ్రీ డాక్టర్ శాంతానంద పురోహిత్ తెలిపారు. ఉత్సవాలలో భాగంగా సోమవారం శ్రీ బాలా త్రిపుర సుందరి, శ్రీ గాయత్రి దేవి, శ్రీ అన్నపూర్ణ దేవి, శ్రీ కాత్యాయని దేవి, శ్రీ లలిత త్రిపుర సుందరి, శ్రీ శాకాంబరి దేవి, శ్రీ మహా లక్ష్మీ దేవి, శ్రీ సరస్వతి దేవి, శ్రీ దుర్గా దేవి, శ్రీ మహిషాసుర వర్ధిని, శ్రీ రాజ రాజేశ్వరి దేవి అలంకరణలతో అమ్మవారిని అలంకరించనున్నట్లు తెలిపారు. కాగా ప్రతిరోజు ఉట్కూర్ శివానంద్ పురోహిత్, పూజ్య శ్రీ డా. శాంతానంద్ పురోహిత్, బ్రహ్మ శ్రీ జోషి రఘు ప్రేమాచారి, ఇరువింటి శ్రావన్ కుమార్, బ్రహ్మ శ్రీ కరణం రాఘవేంద్ర చారి, బ్రహ్మ శ్రీ శాస్త్రుల ప్రాణేష్ పూజారి, కార్తిక శర్మ, బ్రహ్మ శ్రీ రాఘవేంద్ర నారాయణ చార్యుల చేత ప్రతిరోజు ప్రవచనలు ఉంటాయని కావునా భక్తుల హాజరై మాత కృపకు పాత్రులు కాగలరని కోరారు.



బాలబ్రహ్మేశ్వర ఆలయంలో భక్తుల పూజలు



శరన్నవరాత్రులకు అలంకరించిన శక్తి పీఠం

పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

నారాయణపేట రూరల్ : రైతుల సౌకర్యార్థం వెంటనే పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర కార్యదర్శి బి.రాము డిమాండ్ చేశారు. ఆదివారం కోటకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పత్తి పంట చేతికి వచ్చినా కొనుగోలు ప్రక్రియ ఇప్పటికీ ప్రారంభం కాలేదన్నారు. వర్షాల వల్ల పత్తి తడిసి రైతులు నష్టపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తీసిన పత్తిని నిలువ చేసుకొనే సౌకర్యం రైతులకు ఉండదని, ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి)పొడువు పింజ రూ.8110, మధ్యస్థ పింజ రూ.7710గా ప్రకటించినా ఈ ధరలు ఎక్కడ అమలు కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను ఆదుకుంటామని ఎన్నికలకు ముందు వాగ్దానాలు చేసిందని మాట తప్పిందన్నారు. ఇంకా పత్తిపై ఉన్న దిగుమతి సుంకం ఎత్తి వేయడంతో విదేశాల నుంచి దేశంలోకి పత్తి విరివిగా దిగుమతి అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాములు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటంలో సీపీఐకు వందేళ్ల చరిత్ర

అమరచింత: దేశ స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు ప్రజా పోరాటాల్లో సీపీఐకి వందేళ్ల చరిత్ర ఉందని, ప్రతినిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తి పోరాడే శక్తిగా దేశంలో ఎదిగిందని పార్టీ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. పార్టీ 25వ జాతీయ మహాసభలకు సంఘీభావం తెలుపుతూ మండల కేంద్రంలో ఆదివారం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో వెట్టిచాకిరీ నుంచి తెలంగాణ విముక్తి కోసం సీపీఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక చర్యల వల్ల పేదలు పేదలగానే మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అబ్రహం, భాస్కర్ పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీకి ఘన నివాళి



ధన్వాడ: మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని ధన్వాడ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ భక్తమార్కండేయ స్వామి దేవాలయంలో ఆయన చిత్రపటాన్ని ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదయభాను మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమానికి లక్ష్మణ్ బాపూజీ ఎన్నో సేవకార్యక్రమాలు చేశారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాకం సురేందర్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, బాలప్ప, బాల్‌రాజు, వెంకట్రాములు, జయప్రకాష్, నర్సింములు, బాలయ్య పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

కృష్ణా: ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ సాధించిన ప్రదీప్ అనే విద్యార్థిని ఆదివారం చేగుంట గ్రామంలో కుర్వ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన కుర్వ కీరప్ప కుమారుడు ప్రదీప్ కామరెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ సాధించాడు. ఈ క్రమంలో స్థానిక కుర్వ సంఘం నాయకులు తండ్రితో పాటు కుమారుడిని అభినందించి సన్మానించారు. వైద్యుడుగా పట్టా పొందిన తర్వాత పేదలకు నాణ్యమైన అందించాలని కోరారు. కార్యక్రమంలో కుర్వ సంఘం మండల అధ్యక్షుడు మహాలింగప్ప, సిద్ధప్ప తదిదరులు పాల్గొన్నారు.